క్లుప్తంగా

విద్యార్థులకు నోట్ పుస్తకాలు



తెనాలిఅర్బన్: నేరెళ్ల దివి, అన్నపూర్ణ దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ అధ్యక్షుడు నేరెళ్ల కృష్ణ మోహన్‌రావు ఆధ్వర్యంలో చంద్రబాబునాయుడు కాలనీలోని స్పెషల్ ఎలిమెంటరీ మున్సిపల్ స్కూల్‌లోని విద్యార్థులకు సోమవారం నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకులు కాకరపర్తి సుబ్రమణ్యం, సాతులూరి రాంప్రసాద్, జవ్వాజి శ్రీనివాసరావు, తుల్లిమిల్లి వరప్రసాద్, హెచ్‌ఎం బత్తుల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నెహ్రూ నికేతన్‌లో ఎక్స్ పో



తెనాలిఅర్బన్: నెహ్రూనికేతన్ పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం నుంచి శుక్రవారం వరకు అకడమిక్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతా కాంత్ తెలిపారు. బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ స్కూల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రెండో తరగతి నుంచి ఐదో తరగతి వరకు చదివే చిన్నారులు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. తరగతి గదిలో విద్యార్థులు నేర్చుకున్న అంశాలను వేదికపై వివరించనున్నట్లు వెల్లడించారు.

వీధి కుక్కలకు శస్త్రచికిత్సలు




తెనాలిఅర్బన్: పట్టణంలోని వీధి కుక్కలకు శస్త్ర చికిత్సలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. బుర్రిపాలెం రోడ్డు కంపోస్టు యార్డులోని కుక్కల శస్త్ర చికిత్సాలయాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఆపరేషన్లు చేసేందుకు అవసరమైన వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కారణాల వలన ఇప్పటి వరకు వీధి కుక్కలను పట్టుకుని మంగళగిరిలో శస్త్ర చికిత్సలు చేయించినట్లు వివరించారు. మళ్లీ తెనాలిలో శస్త్ర చికిత్సలు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ



తెనాలిరూరల్: రెవెన్యూ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ఆవిష్కరించారు. అసోసియేషన్ నాయకులతో రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్, కార్యదర్శి వెంకట్రావు, తెనాలి డివిజన్ కార్యదర్శి చంద్రశేఖర్, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా కార్యదర్శి షేక్ అయూబ్, కుమార్, మహేష్, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు నాగ శంకరయ్య, ప్రసాద్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా భద్రావతి సమేత భావనారుషి స్వామి కల్యాణం



మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు వీరభద్ర స్వామి ఆలయంలో సోమవారం భద్రావతి సమేత భావనారుషి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. పద్మశాలీయ సంఘం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కల్యాణం జరిగింది. పెండ్లి కుమారుడిని చేయుట, విశ్వేశ్వర పూజ, పుణ్యాహ వచనం, అఖండ దీపారాధన, నవగ్రహ మండపారాధన శాంతి హోమం, 18 మంది దంపతులతో కల్యాణ మహోత్సవం నిర్వహించారు. స్వామి వారి కల్యాణం అనంతరం ఆత్మకూరు పుర వీధుల్లో స్వామి వాకి గ్రామోత్సవం మేళ తాళాలతో, కనక తప్పెట్లు, బాణ సంచా కాల్పులతో వైభవోపేతంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణం తిలకించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎలా బతకాలనీ!

- పూలే కాలనీ వాసుల ఆవేదన
- కాలనీ ఏర్పడి 13 ఏళ్లు దాటినా సమకూరని వసతులు
- మంచినీటి కోసం కటకట



రామలింగేశ్వరపేట శివారు ప్రాంతంలో ఉన్న పూలే కాలనీ

తెనాలిఅర్బన్: మహాత్మా జ్యోతిబా పూలే కాలనీ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. కాలనీ ఏర్పడి 13 ఏళ్లు దాటినా నేటికీ మౌలిక వసతుల కల్పన జరగలేదు. దీనికి తోడు మంచినీటి కొరత స్థానికులను వేధిస్తోంది. నిత్యం మున్సిపల్ ట్యాంకర్ కోసం వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. తెనాలి రామలింగేశ్వరపేట గురవయ్య కాలనీ చివర ఉన్న మున్సిపల్ స్థలాన్ని సుమారు 13 ఏళ్ల క్రితం అప్పటి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి సీనియర్ నాయకుడు పమిడిపాటి కోటయ్య ఆధ్వర్యంలో పేదలు ఆక్రమించుకున్నారు. దీనిలో కొందరు నివాసాలు ఏర్పాటు చేసుకుని మహాత్మ జ్యోతిబా పూలే కాలనీగా నామకరణం చేశారు. అప్పటి నుంచి కూలి పనులు చేసుకునే పేదలు అక్కడ నివసిస్తున్నారు. మౌలిక వసతుల కల్పన కోసం వారందరూ అనేక సార్లు ఆందోళనలు చేసి కొన్ని వసతులు సమకూర్చుకోగలిగారు. అక్కడున్న 83 నివాస గృహాల్లో సుమారు 400 మంది ప్రస్తుతం నివసిస్తున్నారు.

కన్పించని అంతర్గత రోడ్లు

పూలే కాలనీలో అంతర్గత రోడ్లు, మురుగు కాల్వలు లేవు. పేదలు తాము ఏర్పాటు చేసుకున్న గ్రావెల్ రోడ్లపైనే నడవాల్సిన దుస్థితి. అలాగే మురుగు పోయే దారి లేకపోవటంతో ఇంటి ఆవరణలోనే కొందరు గుంతలు తవ్వి మురుగును ఎత్తిపోసుకోవాల్సి వస్తోంది. దీనివల్ల వర్షాలు కురిసినప్పుడు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సదుపాయాన్ని కల్పించాలని 11వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ కఠారి రత్నకుమారి, కఠారి హరీష్ అధికారులకు పలుమార్లు విన్నవించారు. దీంతో అక్కడ విద్యుత్ స్తంభాలతోపాటు వీధి దీపాలు ఏర్పాటు చేశారు. గత సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాత్కలిక ఇంటి నంబర్లు అధికారులు ఇచ్చారు. అలాగే అక్కడున్న పేదలకు రేషన్ కార్డులు, ఓటర్ కార్డులను ప్రస్తుతం ఉన్న నంబర్లపై ఇచ్చారు.

కన్పించని ఇళ్ల పట్టాలు

కాలనీ ఏర్పడి 13 ఏళ్లు దాటినా నేటికి వారికి ఇళ్ల పట్టాలను అధికారులు ఇవ్వలేదు. పట్టాలు ఇవ్వాలని కాలనీవాసులు అనేక సార్లు ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి వినతి పత్రాలు ఇచ్చారు. కానీ నేటికి అది జరగలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వారికి ఇళ్లపట్టాలు ఇవ్వడంతోపాటు మౌలిక వసతులైన రోడ్లు, కాల్వలు సమకూర్చాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



కాలనీకి వెళ్లే దారిలో ఇరువైపులా ఉన్న వ్యర్థాల గుట్టలు

నీటి వసతిని ఏర్పాటు చేయండి



పూలే కాలనీలో అనేక సమస్యలు ఉన్నాయి. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో పూలే కాలనీలోని పేదల మంచినీటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. రోడ్లు, కాల్వలు నిర్మించేందుకు ప్రతిపాదనలు అధికారులకు అందజేశాం. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి వెంటనే కాలనీ వాసులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి. మంచినీటి పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయాలి.

–కఠారి రత్నకుమారి, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్, 11వ వార్డు

మౌలిక వసతులు కల్పిస్తాం



పూలే కాలనీలో మౌలిక వసతులు లేవన్న విషయం నా దృష్టికి వచ్చింది. ప్రస్తుతం కాలనీ వాసుల దాహార్తిని తీర్చేందుకు కుళాయి కనెక్షన్‌లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కొద్దిరోజుల్లో పనులు ప్రారంభమవుతాయి. అలాగే అంతర్గత రోడ్లు, కాల్వల నిర్మాణానికి ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటాం.

–బండి శేషన్న, కమిషనర్, తెనాలి పురపాలక సంఘం

మంచినీటికి కటకటలాడుతున్న ప్రజలు

తెనాలి పట్టణంలోని రక్షిత మంచినీటి పథకం ద్వారా పూలే కాలనీలో నీటి వసతి కల్పించాలని గతంలో అధికారులు భావించి పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. దాని ద్వారా వచ్చిన నీటిని ఉపయోగించుకునే వారు. సుమారు మూడేళ్ల క్రితం పైప్‌లైన్ పూడిపోవటంతో నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో కౌన్సిలర్ రత్నకుమారి విజ్ఞప్తి మేరకు అధికారులు ప్రతిరోజు ఉదయం రక్షిత మంచినీటి ట్యాంకర్‌ను అక్కడికి పంపుతున్నారు. ఇటీవల మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక వార్డులో పర్యటిస్తున్నప్పుడు కౌన్సిలర్, కాలనీ వాసులు నీటి సమస్యను తెలియజేసి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. త్వరలో నీటి సమస్యకు పరిష్కారం చూపుతానని ఆమె హామీ ఇచ్చారు.



వాటర్ ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న కాలనీ వాసులు

కీలుగుర్రం వాహనంపై భావనారుషి స్వామి

తెనాలి: స్థానిక షరాఫ్‌బజారులోని శ్రీభద్రావతి సహిత శ్రీభావనారుషి స్వామి దేవస్థానంలో ఇటీవల జరిగిన స్వామి కల్యాణోత్సవం తదుపరి పదహారు రోజుల పండగ సందర్భంగా సోమవారం రాత్రి స్వామివార్ల కీలుగుర్రం ఊరేగింపును నిర్వహించారు. పురవీధుల్లో సాగిన ఈ ఊరేగింపును పలువురు భక్తులు దర్శించుకున్నారు. పూజలు చేశారు. శ్రీపద్మశాలీయ బహూత్తమ సంఘం, ఉత్సవ నిర్వహణ కమిటీ, దేవస్థానం పాలకవర్గం సంయుక్తంగా ఈ వేడుకను నిర్వహించారు. పెద్ద శ్రేష్ఠులు జొన్నాదుల కృష్ణ సత్యనారాయణ, జొన్నాదుల వెంకట కోటేశ్వరరావు, తాడిపర్తి శివ సత్యనారాయణ వరప్రసాద్, శ్రీపద్మశాలీయ బహూత్తమ సంఘం గౌరవ అధ్యక్షుడు జొన్నాదుల మహేష్, గౌరవ సలహాసభ్యులు అక్కల శ్రీరామ్, దివి హేమంత్ కుమార్, గుంటి వెంకట్, అధ్యక్షుడు తిరువీధుల సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి పంచుమర్తి భాస్కరరావు, కోశాధికారి గట్టు బాల శ్రీనివాసరావు, ఉత్సవ నిర్వహణ కమిటీ చిన్నం హరిగోపాల్, జొన్నాదుల మదన్మోహన్రావు, ఆకురాతి శ్రీనివాసరావు, గుంటి ధనలక్ష్మి, తాడిపత్రి శ్రీనివాసరావు తదితరులు పర్యవేక్షించారు

జలపాలేశ్వరుడికి విశేష పూజలు



ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలోని జలపాలేశ్వర స్వామి ఆలయంలో మాఘ శుద్ధ పంచమిని పురస్కరించుకొని సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు ఉమాపతి శాస్త్రి స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, అష్టోత్తర, సహస్రనామ పూజలు బిల్వదళాలతో చేశారు. అనంతరం నమక చమకాలతో జలాభిషేకాలు నిర్వహించి అర్చనలు చేశారు. భక్తుల గోత్రనామాలతో పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి

తెనాలిరూరల్: విద్యుదాఘాతంతో భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన ఘటన తెనాలి నెహ్రూ రోడ్డులో సోమవారం జరిగింది. ఇక్కడి రజకచెరువు ఎదుట నిర్మాణంలో ఉన్న మూడంతస్తుల భవనానికి ఎలివేషన్ పనులు చేసేందుకు బాదులతో పరంజా ఏర్పాటు పనులు సోమవారం చేపట్టారు. కొల్లిపర గ్రామానికి చెందిన కేశన గోపి(34) పరంజా కడుతుండగా పచ్చిగా ఉన్న బాదు పక్కనే ఉన్న హైటెన్షన్ విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. కాలిన గాయాలతో అక్కడే కుప్పకూలాడు. సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ రాములనాయక్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో తోటి కూలీలు మృతదేహాన్ని కిందకు దించగా, పోలీసులు తెనాలి ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



ఘటనాస్థలంలో ఉన్న గోపి మృతదేహం

మృతదేహంతో ధర్నా

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ప్లంబర్ మృతి చెందగా, అతని కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు మృతదేహంతో ధర్నాకు దిగారు. మండలంలోని కోపల్లె గ్రామానికి చెందిన ప్లంబర్ ఖగ్గా రవికుమార్ ఈనెల 15న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయాలపాలయ్యాడు. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు సోమవారం అప్పగించారు. అంగలకుదురు సెంటరుకు చేరుకున్న బంధువులు మృతదేహంతో ధర్నాకు దిగారు. ఆర్టీసీ అధికారులు మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా కారణంగా పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న త్రీటౌన్ సీఐ ఎస్.రమేష్‌బాబు, రూరల్ ఎస్ఐ సీహెచ్ ప్రతాప్‌కుమార్ ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న వారితో సంప్రదింపులు జరిపి ధర్నాను విరమింపజేశారు.



రవికుమార్ మృతదేహంతో ధర్నా చేస్తున్న బంధువులు

దుబాయ్‌లో అంతర్జాతీయ ఎక్స్‌పో

- 'గల్ఫ్‌ఫుడ్'లో తెనాలి డబుల్‌హార్స్
- సీఎండీ మునగాల మోహన్ శ్యామ్‌ప్రసాద్

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలికి చెందిన తెనాలి డబుల్‌హార్స్ గ్రూప్ (టీడీజీ) ప్రపంచంలోనే అతి పెద్ద వార్షిక ఆహార, పానీయాల వాణిజ్య ప్రదర్శన 'గల్ఫ్‌ఫుడ్-2025'లో భాగస్వామ్యంతో ప్రపంచ విస్తరణ ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. గత నెలలో గ్రేటర్ నోయిడాలో జరిగిన ఇండస్ ఫుడ్-2025లో తన ఉత్పత్తులను ప్రదర్శించిన తెనాలి డబుల్‌హార్స్ గ్రూప్ ఇప్పుడు దుబాయ్‌లో జరుగుతున్న గల్ఫ్‌ఫుడ్‌లో తన ఉత్పత్తులతో కూడిన స్టాల్‌ను ఏర్పాటుచేసింది. అంతర్జాతీయ మార్కెట్లను చేరుకోవటం, భారతీయ ఆహార వారసత్వాన్ని ప్రపంచ వినియోగదారులకు పరిచయం చేయటంలో తన నిబద్ధతకు ఇదో నిదర్శనం. ఎక్స్‌పోను సందర్శించిన భారతదేశ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ క్యాబినెట్ మంత్రి మంత్రి చిరాగ్ పాశ్వాన్ తెనాలి డబుల్‌హార్స్ బ్రాండ్ స్టాల్‌కు విచ్చేశారు. అక్కడి టీడీజీ ప్రత్యేకమైన సున్నుండను రుచిచూశారు. సంప్రదాయమైన వంటకానికి అద్భుతమైన నాణ్యత, రుచిని జోడించారంటూ ప్రశంసించటం గర్వకారణమని తెనాలి డబుల్‌హార్స్ గ్రూప్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మునగాల మోహన్ శ్యామ్‌ప్రసాద్ వెల్లడించారు. గల్ఫ్‌ఫుడ్ ఎక్స్‌పోలో టీడీజీ ఈసారి చిరుధాన్యాల ఉత్పత్తులను ప్రదర్శించటం మరో విశేషం. ఎక్స్‌పోకు మించి దుబాయ్‌లో కొత్తగా ప్రారంభించిన డబుల్‌హార్స్ కార్యాలయం ఏర్పాటుతో మిడిల్ ఈస్టర్న్ మార్కెట్‌లో గణనీయమైన పురోగతిని సాధిస్తున్నట్లు మోహన్ శ్యామ్‌ప్రసాద్ చెప్పారు. రూరల్ నుంచి గ్లోబల్ వరకు కొనసాగుతున్న తమ ప్రయాణంలో బ్రాండ్ ఆవిష్కరణ, ఏకీకరణ, ఖాతాదారు కేంద్రీకృత వృద్ధిపై దృష్టి సారించినట్టు చెప్పారు.



దుబాయ్ ఎక్స్‌పోలో తెనాలి డబుల్‌హార్స్ స్టాల్

పురుగు మందు తాగి గొర్రెల కాపరి మృతి

చెరుకుపల్లి: గొర్రెలు మేపుకునేందుకు వచ్చిన యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్సై టి.అనీల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కృష్ణా జిల్లా కోడూరు మండలం, రామకృష్ణాపురం గ్రామానికి చెందిన పరిశా భార్గవ్(26) గత కొద్ది రోజుల క్రితం గొర్రెలు మేపుకునేందుకు కనగాల గ్రామం వచ్చాడు. అయితే తనకున్న అప్పుల కారణంగా ఈ నెల 15వ తేదీ శనివారం కనగాల మద్యం దుకాణంలో మందు తీసుకొని అందులో పురుగు మందు కలుపుకొని తాగి అపస్మారక స్థితిలో పడిపోవటంతో అదే గ్రామంలో ఉన్న బంధువులు భార్గవ్‌ను చెరుకుపల్లి వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అయితే భార్గవ్ చికిత్స పొందుతూ ఆదివారం అక్కడే మృతి చెందాడని మృతుడి తండ్రి పరిశా బాబురావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి వివాహం జరిగి సంవత్సరం అయింది. అతడికి భార్య ఉంది.



చికిత్స పొందుతూ మృతి చెందిన భార్గవ్

భౌ..భౌ.. లేదిక భయం

- వీధి కుక్కల బెడద నియంత్రణకు కార్పొరేషన్ చర్యలు
- కాజలో కుటుంబ నియంత్రణ, యాంటీ రేబిస్ సెంటర్ ఏర్పాటు
- శునకాలకు ఆపరేషన్‌లు చేయిస్తున్న అధికారులు
- తీరనున్న నగరవాసుల ఆందోళన



కాజలో ఏబీసీ అండ్ డాగ్ స్టెరిలైజేషన్ అండ్ యాంటీ రేబిస్ సెంటర్

మంగళగిరి: ఏ వీధిలోకి వెళ్తే.. ఎక్కడ పిక్క పట్టుకుంటుందనే భయం.. బైక్ హారన్ మోగితే ఎటు నుంచి వస్తాయోనని గుండె దడ.. చీకటి పడిందంటే ఏ సంధులో నుంచి వస్తాయోననే బెరుకు.. చిన్న పిల్లలు ఏమైనా తినుబండారాలతో కనిపిస్తే ఎక్కడ పట్టుకుని వెళ్తాయోననే ఆందోళన.. ఇదీ మంగళగిరి నగర ప్రజలు వీధి కుక్కల బెడదతో పడుతున్న వేదన. ప్రస్తుతం మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ(ఎంటీఎంసీ) పరిధిలో నెలకు సుమారు 30 మంది కుక్క కాటుకు గురవుతున్నారు. గ్రామ సింహాల భయం నుంచి ప్రజలకు విముక్తి కల్గించేందుకు.. మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. శునకాల నియంత్రణతో పాటు వాటిని ఒక షెడ్డులో ఉంచేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రేబిస్ వ్యాక్సిన్ సిద్ధం చేయడంతో పాటు కుక్కల సంతానోత్పత్తికి బ్రేకులు వేసేందుకు కార్పొరేషన్ అధికారులు సిద్ధమయ్యారు.

వీధి కుక్కల బెడద తప్పినట్లే..

ఇందులో భాగంగా కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించేందుకు నగర పరిధిలోని కాజలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏబీసీ అండ్ డాగ్ స్టెరిలైజేషన్ యాంటీ రేబిస్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ పట్టుకొచ్చిన కుక్కలను ఉంచేందుకు షెడ్డు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసేందుకు గదులు ఏర్పాటు చేశారు. నగర పరిధిలోని సుమారు 4 వేల కుక్కలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. కుక్కలను తీసుకెళ్లి రెండు రోజుల పాట అక్కడే ఉంచి ఆపరేషన్లు చేయిస్తున్నారు. మళ్లీ మూడు రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉంచి వాటిని ఎక్కడైతే పట్టుకున్నారో అక్కడే వదిలేసేలా చర్యలు తీసుకుంటున్నారు. రోజుకు పది కుక్కలకు తగ్గకుండా ఆపరేషన్ చేయించేందుకు అనుగుణంగా షెడ్డు వైద్యులు అందుబాటులో ఉండే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఖర్చు చేసి శాశ్వత పరిష్కారానికి శ్రీకారం చుట్టారు.



ఆపరేషన్ కోసం తెచ్చిన శునకం

సంతానోత్పత్తి నియంత్రణ చర్యలు



నగరంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని ఫిర్యాదులు అందుతున్నాయి. కుక్కలను చంపడం, అడవుల్లో వదిలిపెట్టడం నేరం. వాటికి కుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించడం ద్వారా ఉత్పత్తిని తగ్గించడానికి చర్యలు తీసుకుంటున్నాం. నగరంలో ప్రజలు కుక్కలతో ఇబ్బంది పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

–అలీం బాషా కమిషనర్, ఎంటీఎంసీ



కుక్కలను తీసుకెళ్తున్న సిబ్బంది

ఘనంగా గణపతి కల్యాణం

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని మెల్లెంపూడిలో వేంచేసిని సిద్ధి బుద్ధి సమేత మహా గణపతి దేవాలయ 19వ వార్షికోత్సవాన్ని సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కన్వీనర్ దొంతిరెడ్డి వేమారెడ్డి విచ్చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ స్వామికి ప్రత్యేక అభిషేకాలు, ద్వాదశ ఫలాభిషేకాలు, గణపతి హోమం, సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామి దివ్య కల్యాణ ఉత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించామని తెలిపారు. సుమారు 2 వేల మంది భక్తులకు అన్నదానం చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాజా రామిరెడ్డి, దొంతిరెడ్డి వెంకట శివరామకృష్ణా రెడ్డి, కుర్రే మల్లారెడ్డి, దొంతిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఉయ్యూరు శివరామిరెడ్డి, దొంతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తాడేపల్లి పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, మున్నంగి వివేకానందరెడ్డి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



■ మెల్లెంపూడి గ్రామంలో వేంచేసిన ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం 10వ వార్షికోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని పేర్కొన్నారు.

వైభవంగా గ్రామదేవతల పుట్టినరోజు వేడుకలు



కొల్లూరు : గ్రామ దేవతల పుట్టినరోజు వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. సోమ వారం కొల్లూరు గ్రామ దేవతలైన చింతలమ్మ, అంకమ్మల జన్మది నోత్సవాన్ని పు రస్కరించుకొని దక్షిణపు వీధిలోని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలోపాల్గొని దేవతామూర్తుల దర్శనం చే సు కొని ప్రత్యేక పూజల్లో పాలుపంచుకున్నారు. గ్రా మ దేవతల పుట్టినరోజును పురస్కరించుకొని కొల్లూరు పార్వతీ అమ్మవారి ఆలయం నుంచి సంప్రదాయ బద్ధంగా గ్రామ దేవతలకు సారెను ఊ రేగింపుగా తీసుకుని వెళ్లి భక్తులు సమర్పించారు.